క్లుప్తంగా

అవయవదానానికి ముందుకురండి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జె.సి.రాజు, తదితరులు

బొబ్బిలి: ఒకరి అవయవదానంతో కొందరి జీవితాల్లో వెలుగులు నింపవచ్చని, అపోహలు వీడి అవయవ దానం చేసేందుకు ముందుకు రావాలని కారుణ్య ఫౌండేషన్ చైర్మన్ జె.సి.రాజు పిలుపునిచ్చారు. అవయ వదానం పై అవగాహన కల్పిస్తూ ముద్రించిన వాల్‌పోస్టర్లను పట్టణంలోని కారుణ్య ఫౌండేషన్ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని సేవల కన్నా అవయ వదానం మిన్న అని ,మనిషి మరణానంతరం అవయవాలు దానం చేయడం వల్ల 8 మందికి పునర్జీవాన్ని ప్రసాదించవచ్చని పేర్కొన్నారు. అవయవదానం ద్వారా మృతిచెందిన వ్యక్తి అమర జీవిగా మారుతారని అన్నారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు సత్యంనాయుడు,రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

శ్రమదానంతో రోడ్డు మరమ్మతులు



సారవానివలస-కొండ ఇప్పలవలస రోడ్డులో మరమ్మతులు చేస్తున్న యువకులు

మెంటాడ: లోతుగెడ్డ పంచాయతీలోని తారు రోడ్డు నుంచి ఆ పంచాయతీ మధుర గ్రామాలు సారవానివలస, కొండ ఇప్పలవలసకు వెళ్లే గ్రావెల్ రోడ్డు పూర్తిగా గోతులమయమైంది. ద్విచక్ర వాహనాలు, ఆటోల్లో రాకపోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. అంబులెన్స్‌లు కూడా రాలేని పరిస్థితి ఏర్పడింది. రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు అధికారులను ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోకపోవడంతో విసిగివేసారి పోయారు. అధికారులు, పాలకుల వల్ల ఇప్పటిలో పనులు జరగవని భావించిన ఆయా గ్రామాల గిరిజన యువత బుధవారం శ్రమదానం చేసి రోడ్డు బాగు చేసుకున్నారు. గుంతలను మట్టితో పూడ్చడంతో పాటు రోడ్డుకు ఇరువైపులా ఉన్న తుప్పలను తొలగించారు.

ఆర్‌ఓ వాటర్ ప్లాంట్ ప్రారంభం



ఐటీఐలో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

రాజాం సిటీ: స్థానిక రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ తన తల్లి చంద్రావతి పుట్టినరోజును పురస్కరించుకుని పట్టణంలోని ఐటీఐ కళాశాలకు ఆర్‌ఓ వాటర్‌ప్లాంట్‌ను సమకూర్చారు. ఈ వాటర్ ప్లాంట్‌ను ఐటీఐ ప్రిన్సిపాల్ బి.భాస్కరరావుతో కలిసి సాయిప్రశాంత్ కుమార్ బుధవారం ప్రారంభించారు. అలాగే ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులు మధ్యాహ్న భోజనాలు చేసేందుకు నిర్మించిన షెడ్డు, శాఖా గ్రంథాలయానికి ఏర్పాటు చేసిన గేటును ప్రారంభించారు. కొత్తా సౌందర్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ షణ్ముఖరావు, లైబ్రేరియన్ అమర్, మానవతా సంస్థ అధ్యక్షుడు బి.వి.అచ్యుత్‌కుమార్, పెంకి చైతన్య కుమార్, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన గ్రామాల్లో కార్డన్ సెర్చ్

బొబ్బిలిరూరల్: మండలంలోని మోసూరువలస,చెల్లివలస,కొయ్యికొండవలస గిరిజన గ్రామాల్లో బుధవారం ఉదయం పోలీసులు కార్డన్ సెర్చ్ నిర్వహించారు. సీఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సోదాల్లో 25 మద్యం సీసాలతో వి.రామారావు అనే వ్యక్తి పట్టుబడ్డాడు.అనంతరం సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడినా, నాటు తుపాకులు,గంజాయి వంటివి కలిగి ఉన్నా, చట్టాలను ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గిరిజనులకు పలు చట్టాలపై అవగాహన కల్పించారు. సోదాల్లో ఎస్‌ఐలు రమేష్,వి.ప్రసాద్, లోకేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

విజేతలకు బహుమతులు ప్రదానం

రామభద్రపురం: పొగాకు ఉత్పత్తుల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై జాతీయ టోబాకో కంట్రోల్ ప్రోగ్రాం కింద మండలంలోని ఉన్నత పాఠశాలల విద్యార్థులకు వైద్యాధికారులు ఇటీవల వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో రామభద్రపురం, బూసాయవలస, ఆరికతోట ఉన్నత పాఠశాలలకు చెందిన 9వ తరగతి విద్యార్థులు కె.జానకేశ్వరి, కె.పుణ్యకుమారి, టి.రాఘవేంద్ర విజేతలుగా నిలిచారు. వీరికి రామభద్రపురం పీహెచ్‌సీ వైద్యాధికారి దిలీప్‌కుమార్, ఎంఈఓతిరుమల ప్రసాద్ బహుమతులుగా బ్యాగులను బుధవారం అందజేశారు. విద్యార్థులను ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు.

నీరు రాదు..సాగు సాగదు

- అన్నదాతకు సాగునీటి కష్టాలు
- పెద్దగెడ్డ రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు
- కాలువ ద్వారా పొలాలకు అందని సాగునీరు
- నిధులున్నా కాలువలో పూడిక, తుప్పలు తొలగించని వైనం



చుక్కనీరు లేని పెద్దగెడ్డ రిజర్వాయర్ కాలువ పరిధిలో ఉన్న తారాపురం చెరువు



జన్నివలస వద్ద పూడిక, పిచ్చిమొక్కలతో అధ్వాన్నంగా ఉన్న సాగునీటి కాలువ



తారాపురంలో ఖాళీగా ఉన్న పంట భూములు

రామభద్రపురం: ప్రతీ ఎకరానికి సాగు నీరందించాలన్న దివంగత ముఖ్యమంత్రి వైఎస్.రాజశేఖర రెడ్డి కలలకు నేటి పాలకులు తూట్లు పొడుస్తున్నారు. జలయజ్ఞంలో భాగం గా జిల్లాలో సాగునీటి వనరులున్న ప్రాంతాల్లో ప్రాజెక్టులు, చెక్‌డ్యామ్‌లు, చెరువుల అభివృద్ధికి రాజశేఖరరెడ్డి అధిక ప్రాధాన్యత ఇచ్చారు. జిల్లాలో ప్రధానంగా తాటిపూడి, ఆంధ్ర,వెంగళరాయసాగర్, తోటపల్లి,జంజావతి తదితర సాగునీటి ప్రాజెక్టులకు వేలాది కోట్ల రూపాయలు ఖర్చు చేసి లక్షలాది ఎకరాల భూములకు సాగునీరందించి న ఘనత దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డికే దక్కుతుంది. కానీ నేటి పాలకులు ఈ ప్రాజెక్టుల నిర్వహణ పట్టించుకోక పోవడంతో రైతులు సాగునీటికి తీవ్ర ఇబ్బంది లు పడుతున్నారు. కూటమి ప్రభుత్వం విస్మరించిన ప్రాజెక్టుల్లో ఒకటి సాలూరు నియోజకవర్గంలోని పాచిపెంట మండలంలో ఉన్న పెద్దగెడ్డ రిజర్వాయర్. ఈరిజర్వాయర్ ను దివంగత ముఖ్యమంత్రి రాజశేఖరరెడ్డి 2007లో ప్రారంభించారు. ఈ రిజర్వాయర్ నుంచి సాలూరు, బొబ్బిలి నియోజకవర్గాల్లో 12 వేల ఎకరాలకు సాగునీరందాల్సి ఉంది. ఈ12 వేల ఎకరాల్లో రామభద్రపురం మండలం పరిధిలోని జన్నివలస, నేరళ్లవలస,కాకర్లవలస,తారాపురం, రామభద్రపురం, బూసాయవలస, ఎస్.చింతలవలస, సోంపురం గ్రామాల రైతులకు చెందిన 3,500 ఎకరాలకు సాగునీరందించాల్సి ఉంది. కానీ పెద్దగెడ్డ జలాశయం నుంచి రామభద్రపురం మండలంలోని భూములకు గత ఖరీఫ్‌లోనూ సాగు నీరు పూర్తిస్థాయిలో అందలేదని, ఈ ఏడాది కూడా నీరు వచ్చే పరిస్థితులు కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

రైతుల ఎదురు చూపులు..

పెద్దగెడ్డ రిజర్వాయర్‌లో పుష్కలంగా నీరు ఉన్నప్పటికీ రామభద్రపురం మండలంలోని రిజర్వాయర్ పరిధిలోని ఆయకట్టు భూములకు నీరు అందేలా కనిపించడం లేదు. పది రోజుల క్రితం పెద్దగెడ్డ రిజర్వాయర్ నుంచి మంత్రి సంధ్యారాణి సాగు నీటిని విడుదల చేశారు. కానీ ఇంత వరకు మండలానికి చుక్క నీరు రాలేదు.ఈ ఏడాది వర్షాలు లేక పోవడంతో ఇంకా వరి ఉభాలు జరగలేదు. వ్యవసాయ బోర్ల ఆధారంగా కొంతమంది రైతులు వరి నాట్లు వేయగలిగారు. చెరువులు కింద ఆయకట్టు భూముల్లో, పెద్దగెడ్డ రిజర్వాయర్ కాలువ పరిధి భూముల్లో ఇంకా నాట్లు పడలేదు. పెద్ద గెడ్డ రిజర్వాయర్ నీటికోసం, వరుణుడి కరుణ కోసం రైతులు ఆశగా ఎదురు చూస్తున్నారు.

నిధులున్నా.. నిర్లక్ష్యమే..

మండలంలోని పెద్దగెడ్డ కాలువ నిర్వహణ పనులకు ప్రభుత్వం రూ.13 లక్షలు నిధులు మంజూరు చేసింది.అయితే ఇప్పటికీ ఎక్కడా పనులు చేపట్టలేదు.కాలువంతా పిచ్చి మొక్కలు, పూడికతోను నిండి పోయి అధ్వానంగా తయారైంది. దీంతో సాగు నీరు సక్రమంగా పొలాలకు అందే పరిస్థితి కనిపించడం లేదు. ఎన్నిసార్లు అధికారులకు విన్నవించుకుంటున్నా ఇదిగో అదిగో అంటున్నారే తప్ప పనులు చర్యలు చేపట్టడం లేదని ఆయకట్టు రైతులు విమర్శిస్తున్నారు. త్వరగా కాలువ నిర్వహణ పనులు చేపట్టి నీరందించాలని రైతులు కోరుతున్నారు.

పట్టించుకోవడం లేదు



సాగు నీటి ఎద్దడి తీవ్రంగా ఉంది.కాలువ ద్వారా ఇప్పటికీ నీరు రాలేదు.అధికారులతో పాటు పాలకులు పట్టించుకోవడం లేదు.గతంలో ఈ సమయానికి సాగునీరు అందేది. సాగు నీరు విడుదల చేసి వారం రోజులు దాటిపోతున్నా మండలంలో మొదట్లో ఉన్న జన్నివలసకే ఇప్పటికీ నీరు చేరలేదు. శివారు ప్రాంతాలకు నీరు అందేసరికి నెల రోజులకు పైగా పడుతుంది. వరి నాట్లు వేసేందుకు అదును దాటిపోతుంది. రైతులు తీవ్రంగా నష్టపోతారు.అధికారులు వెంటనే స్పందించి కాలువ బాగుచేసి,సాగునీరందించేలా చర్యలు తీసుకోవాలి.

– పత్తిగుళ్ల అప్పలనాయుడు,రైతు,జన్నివలస

సాగునీటికి ఇబ్బంది లేదు

పెద్దగెడ్డ రిజర్వాయర్‌లో సాగునీరు పుష్కలంగా ఉంది.సాగునీటికి ఇబ్బంది లేదు. కాలువ ద్వారా రెండు రోజుల్లో మండలంలోకి నీరు ప్రవేశిస్తుంది.అలాగే ఓఎస్‌ఎం పనులు రామభద్రపురం పరిధిలోని 3 పనులు,కొట్టక్కి పరిధిలోని 4 పనుల కోసం రూ.13 లక్షలు నిధులు విడుదలయ్యాయి.ఈ పనులు సంబంధిత నీటి సంఘం చైర్మన్లకు అప్పగించారు.వారు చేయాల్సి ఉంది. చివరి ఆయకటు వరకు సాగునీరందించేందుకు ప్రయత్నిస్తున్నాం.

– జి.శ్రీనివాసరావు,పెద్దగెడ్డ డీఈ,సాలూరు

నమ్మక ద్రోహానికి మారుపేరు చంద్రబాబు

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో మాజీ ఎమ్మెల్యే శంబంగి



చంద్రబాబు మోసాలను మహిళలకు వివరిస్తున్న శంబంగి

బొబ్బిలి: నమ్మక ద్రోహానికి మారుపేరు సీఎం చంద్రబాబునాయుడు అని, ఎన్నికల్లో కల్లబొల్లి మాటలు చెప్పడం, గద్దెనెక్కాక కబుర్లతో కాలక్షేపం చేస్తూ ప్రజలను వంచించండంలో ఆయన దిట్టని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకటచినప్పనాయుడు అన్నారు. పట్టణం పరిధిలోని మల్లమ్మపేటలో బుధవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా నాయకులతో కలిసి శంబంగి ఇంటింటికి వెళ్లి కూటమి ఎన్నికల మేనిఫెస్టో ప్రతులను అందజేసి, వాటిలో పేర్కొన్న హామీలను చంద్రబాబు అమలు చేశారా అని ప్రజలను ప్రశ్నించారు. హామీలేవీ అమలు చేయలేదని, ప్రారంభించిన ఒకటి రెండు పథకాలు కూడా పూర్తిస్థాయిలో అమలు కావడం లేదని ప్రజలు బదులిచ్చారు. పలువురు మహిళలు మాట్లాడుతూ ఈ ప్రభుత్వంతో మాకు ఒరిగిందేమీ లేదని, మాయ మాటలకు మోసపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో జగన్ ప్రభుత్వంలో తేదీలు ప్రకటించి మరీ సంక్షేమ పథకాలు అమలు చేశారని గుర్తుకు తెచ్చుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్‌లు ఇంటి గోపాలరావు, ఎస్.వి. మురళీకృష్ణ, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు తూముల భాస్కరరావు, వార్డు ఇన్‌చార్జ్‌లు పోలకృష్ణ, ,పోల చినవెంకటరమణ, బేతనపల్లి శంకరరావు, పలువురు కౌన్సిలర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా చర్యలు



సంతకవిటి: విద్యుత్ సబ్‌స్టేషన్‌ను పరిశీలిస్తున్న ఈఈ సురేష్‌బాబు, తదితరులు

సంతకవిటి: వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ విజయనగరం రూరల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.సురేష్‌బాబు విలేజ్ ఎనర్జీ అసిస్టెంట్లకు సూచించారు. మండలంలోని సంతకవిటి, జి.ఎస్.పురం సబ్ స్టేషన్‌లను బుధవారం ఆయన పరిశీలించా రు. ఈసందర్భంగా విలేజ్ ఎనెర్జీ అసిస్టెంట్లతో సమావేశమయ్యారు. వర్షాకాలం నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు తరచూ అంతరాయం కలిగే అవకాశం ఉంటుందని ఎక్కడెక్కడ సమస్య ఉందో, లోవోల్టేజ్, హై వోల్టేజ్ సమస్యలను గుర్తించి పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని చెప్పారు. సిబ్బంది నిత్యం అందుబాటులో ఉండాలని ఆదేశించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల మండలంలోని సిరిపురం, మిర్తివలస, మేడమిర్తి, మామిడిపల్లి, పుల్లిట, పొనుగుటు వలస తదితర గ్రామాల్లో 10 ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేశామని చెప్పారు. పాడైన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తామని అన్నారు. ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు అనుమతిస్తే వారి ఇళ్ల రూఫ్‌లపై 200 అడుగుల స్థలంలో రెండు కిలోవాట్‌ల సామర్థ్యం గల సోలార్ పరికరాలను ఏర్పాటు చేస్తామని, వారి విద్యుత్ సబ్సిడీ కొనసాగిస్తూనే నెలకు రూ.200 అద్దె చెల్లిస్తామని తెలిపారు. దీనిని ఎస్సీ, ఎస్టీ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట రాజాం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.వి.ఎస్.ఫణీంద్రకుమార్, సంతకవిటి ఏఈ కె.వినయ్‌కుమార్ తదితరులున్నారు.

పరిశీలన

రాజాం సిటీ: స్థానిక గోపాలపురం సబ్‌స్టేషన్‌లో నూతనంగా ఏర్పాటుచేసిన బ్రేకర్‌ను విద్యుత్ శాఖ ఈఈ జి.సురేష్‌బాబు బుధవారం పరిశీలించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుతోపాటు విద్యుత్ సరఫరాలో తలెత్తే సమస్యలను సరిచేయనున్నామని చెప్పారు. అలాగే ప్రతీ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద స్మార్ట్ మీటర్లు అమర్చుతున్నామని, వీటి ద్వారా విద్యుత్ సరఫరాలో నాణ్యత పరిశీలనతోపాటు సంబంధిత ప్రాంతానికి సరిపడా లోడు ఉందా లేదా అనేది తెలుసుకునేందుకు వీలుంటుందని తెలిపారు. ఆయన వెంట డీఈ ఫణీంద్రకుమార్, ఏఈ కుమార్, తదితరులున్నారు.

గూండాలు, రౌడీలకు పోలీసుల వత్తాసా..?

- ఉప ఎన్నికల్లో దౌర్జన్య కాండతో ప్రజాస్వామ్యం చచ్చిపోయింది
- మాజీ ఎమ్మెల్యే శంబంగి ఆగ్రహం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: గూండాలు, రౌడీలే ప్రస్తుతం రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నట్టుగా ఉందని, వారికి పోలీసులు వత్తాసు పలకడం రాష్ట్ర చరిత్రలో బ్లాక్ డేగా నిలిచిందని మాజీ ఎమ్మెల్యే, బొబ్బిలి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయ కర్త శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అన్నారు. బుధవారం సాయంత్రం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలోని పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ స్థానాలకు జరిగిన ఉప ఎన్నికల్లో టీడీపీ నాయకులు, కార్యకర్తలు బరి తెగించి, దాడులకు దిగుతూ బహిరంగంగా రిగ్గింగ్‌కు పాల్పడడం దారుణమన్నారు. ఓటర్లకు ఇచ్చే బ్యాలెట్ పత్రాలను లాక్కుని వారిని బెదిరించి పోలింగ్ బూత్ నుంచి పంపేయడం కన్నా అరాచకం ఎక్కడైనా ఉందా అని ప్రశ్నించారు. బయటి నియోజకవర్గాల నుంచి టీడీపీ గూండాలను పిలిపించి రిగ్గింగ్ అరాచకాన్ని సృష్టించిన వారిని అడ్డుకోకుండా పోలీసులే ఓటర్లను కొట్టి వెనక్కు పంపడం రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ జరగలేదన్నారు. పులివెందులలో జెడ్పీటీసీ అభ్యర్థి ఇంటి చుట్టూ వందల మంది పోలీసులు పహారా కాయడం సిగ్గు చేటన్నారు. ఎన్నికల హామీలను తుంగలో తొక్కిన చంద్రబాబు అండ్ కో కు ప్రజాస్వామ్య పద్ధతిలో గెలుపు సాధించలేమని స్పష్టం కావడంతో దుండగుల్లా బరితెగించారన్నారు. ఒంటిమిట్టలో మంత్రుల నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ఏజెంట్లపై దాడి చేసి ఓట్లను గుంజుకోవడం ప్రజాస్వామ్యానికి,భారత ఎన్నికల సరళికి మాయని మచ్చన్నారు. ఎస్పీ, డీఎస్పీ స్థాయి పోలీసు అధికారులే నేరుగా ఓటర్లను తరిమికొట్టడం ఏ పోలీసు వ్యవస్థ లో రాసుందని నిలదీశారు. కాల్చేస్తాం, చంపేస్తాం అని ఓటర్లను పోలీసులు బెదిరించిన రోజులు తన రాజకీయ జీవితంలో ఎన్నడూ చూడలేదన్నారు. తానే కాదు ఏప్రజాప్రతినిధి కూడా ఇంతటి నీచమైన ఎన్నికలొస్తాయనుకోలేదన్నారు. ఎన్నికల సంఘం, కోర్టులు సుమోటోగా తీసుకుని ఎన్నికలను రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని డిమాండ్ చేశారు.

ప్రతీ ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగరాలి

రేగిడి: స్వాతంత్ర్య దినోత్సవం రోజున ప్రతి ఇంటిపై మువ్వన్నెల జెండా ఎగురవేయాలని ఏపీఎం గోవిందరావు సూచించారు. రేగిడి, ఉప్పరనాయుడువలస, చాటాయవలస తదితర గ్రామాల్లో బుధవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఏపీఎం మాట్లాడుతూ ఎందరో మహానుభావుల త్యాగాల ఫలితమే నేడు మన అనుభవిస్తున్న స్వాతంత్ర్యమని అన్నారు. వారందరి త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

ఈనెల 23 నుంచి సీపీఐ మహాసభలు



మహాసభల పోస్టర్లను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

బొబ్బిలి: ఒంగోలులో ఈ నెల ఈనెల 23వ తేదీ నుంచి 25 వరకు నిర్వహించనున్న సీపీఐ 28వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఆపార్టీ జిల్లా కార్యదర్శి ఒమ్మి రమణ పిలుపునిచ్చారు. స్థానిక సీపీఐ కార్యాలయంలో మహాసభల పోస్టర్లను బుధవారం ఆవిష్కరించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి తమ పార్టీ కృషిచేస్తోందన్నారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలపై,దళిత,మైనార్టీ వర్గాలపై జరిగే దాడులపై,ఇల్లు, భూమి లేని నిరుపేదలకోసం ఎన్నో పోరాటాలు చేసిన ఘనత సీపీఐకే దక్కుతుందన్నారు.ఎన్నికల్లో ఇచ్చిన సూపర్ సిక్స్, ఇతర హామీల అమలులో టీడీపీ కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. దీనిపై పోరాటానికి కార్యాచరణ రూపొందిస్తున్నామని చెప్పారు. మహాసభలకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపీ కామ్రేడ్ డి.రాజాతో పాటు అనేకమంది ఉద్యమకారులు హాజరవుతారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు కోట అప్పన్న, మునకాల శ్రీనివాస్,గొల్లపల్లి తవుడు, తదితరులు పాల్గొన్నారు.

కూటమి మోసాలను ప్రజలు గుర్తించారు



కస్పావీధిలో బాబు మోసాలను తెలిపే కరపత్రాలను ప్రదర్శిస్తున్న డాక్టర్ రాజేష్, తదితరులు

- 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ'లో వైఎస్సార్‌సీపీ రాజాం ఇన్‌చార్జ్ తలే రాజేష్

రాజాం: అధికారం కోసం చంద్రబాబునాయుడు అండ్ కో వందల హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేశారని, కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడిచిపోయినా హామీలేవీ అమలు చేయకపోవడంతో తాము మోసపోయామని ప్రజలంతా ఇప్పుడిప్పుడే గుర్తిస్తున్నారని వైఎస్సార్‌సీపీ రాజాం నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ అన్నారు. రాజాం పట్టణంలోని కస్పావీధి, బుక్కా వీధిలో బుధవారం 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి రాజేష్ ఇంటింటికీ వెళ్లి ఎన్నికల ముందు కూటమి ఇచ్చిన హామీలు, వాటి అమలుపై ఆరాతీశారు. కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఎత్తేసిన పథకాలు, ఎగనామం పెట్టిన సంక్షేమాన్ని వివరించారు. ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని గత ప్రభుత్వం డీబీటీ ద్వారా సంక్షేమాన్ని అందించిందని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తోందని, తమ పార్టీ కార్యకర్తలకు మాత్రమే కాంట్రాక్ట్ రూపంలో నిధులు ఇస్తోందని, సంక్షేమ పథకాలు అమలుచేయడం లేదని ఆరోపించారు. ఆడబిడ్డ నిధి ఏమైందని, రైతు భరోసా సాయం కొందరికేనా, నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో చెప్పాలని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. వైఎస్సార్‌సీపీ రాజాం పట్టణ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు, పబ్లిసిటీ విభాగం కన్వీనర్ ఆసపు సూర్యం, ఎంప్లాయిస్ అండ్ పెన్షనర్ల విభాగం కన్వీనర్ పాలవలస శ్యామసుందరరావు, ఆర్‌టీఐ కన్వీనర్ వంజరాపు విజయ్‌కుమార్, నాయకులు శాసపు వేణుగోపాలనాయుడు, గంధవరపు హేమంత్, యందవ చిన్నారావు, సలాది సతీష్, వట్టం నీలకంఠం, కె.శేఖర్, సి.నారాయణరావు, కొత్తా రాజు, దొర జగన్నాథం, తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా...

ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలి

బొబ్బిలిరూరల్: గ్రామాల్లో వాటర్ ట్యాంకుల్లో ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలని ఎంపీడీఓ పి.రవికుమార్ పంచాయతీ సిబ్బందికి సూచించారు. మండలంలోని మెట్టవలస,బూర్జివలస గ్రామాల్లో బుధవారం ఆయన పర్యటించారు. తాగునీటి ట్యాంకులు, వీధి కాలువలు పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతపై స్థానికులకు అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి పలు సూచనలు చేశారు.

పల్లెనిద్ర



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఎస్‌ఐ గోపాలరావు

సంతకవిటి: మండలంలోని బిళ్లాణి గ్రామంలో ఎస్‌ఐ ఆర్.గోపాలరావు మంగళవారం రాత్రి పల్లె నిద్ర చేశారు. గ్రామస్తులతో సమావేశమై వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పలు చట్టాల గురించి వివరించారు. సైబర్ నేరాల బారినపడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. మత్తుపదార్థాల జోలికి పోవద్దని యువత, విద్యార్థులకు సూచించారు.

దత్తత గ్రామాలపై దృష్టి సారించాలి

రేగిడి: పోలీస్ సిబ్బంది అంతా దత్తత తీసుకున్న గ్రామాలపై దృష్టిసారించాలని, ఆయా గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా నిఘా ఉంచాలని రాజాం రూరల్ సీఐ ఉపేంద్ర సూచించారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో సిబ్బందితో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగ మాట్లాడుతూ దత్తత తీసుకున్న గ్రామాలను తరచూ సందర్శించాలని చెప్పారు. మాదకద్రవ్యాలు, గంజాయి, పేకాట, దొంగతనాలు, ఇతర అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలని, సిబ్బంది అంతా బాధ్యతగా పని చేయాలని అన్నారు. ఎస్‌ఐ పి. నీలావతి పాల్గొన్నారు.

అవార్డు గ్రహీతకు సన్మానం



ప్రసాదరావును సన్మానిస్తున్న హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

సంతకవిటి: మండలంలోని బొద్దూరు ఉన్నత పాఠశాల జీవశాస్త్ర ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మంతపూడి ప్రసాదరావు సంగీతంలో చేసిన కృషిని గుర్తించి త్యాగరాజ్ గాన సభ ఈనెల 3న హైదరాబాద్‌లోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సంగీత సామ్రాట్ అవార్డు ప్రదానం చేసి, బంగారు కంకణాన్ని బహుమతిగా అందించింది. ఈసందర్భంగా ఉపాధ్యాయుడు ప్రసాదరావును పాఠశాలలో హెచ్‌ఎం మల్లేశ్వరరావు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు బుధవారం సన్మానించారు. ఉపాధ్యాయులు దామోదరరావు, సత్యనారాయణ, కృష్ణ శ్రీరామ్, తదితరులు పాల్గొన్నారు.

అమెరికాకు తలొగ్గితే రైతులకు నష్టం



బొబ్బిలి: రాస్తారోకో చేస్తున్న సీఐటీయూ, రైతుసంఘం నాయకులు

రాజాం/బొబ్బిలి: స్వేచ్ఛ వాణిజ్య ఒప్పందంలో భాగంగా అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సుంకాలు పెంచుకుంటూ పోతున్నారని, దీనిపై మన ప్రధాని మోడీ మౌనం వహించడం వల్ల ఆహారభద్రతకు, రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, కార్యదర్శి కె.సురేష్ విమర్శించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో రాజాం, బొబ్బిలిలో రైతు, కార్మిక సంఘాలతో కలిసి కేంద్ర ప్రభుత్వ విధానాలపై బుధవార నిరసన తెలుపుతూ రాస్తారోకో నిర్వహించారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ అగ్రిమెంట్‌లో వ్యవసాయం, పాడి, పౌల్ట్రీ రంగాలను చేర్చాలని అమెరికా పట్టుబడుతోందని, మన ఎగుమతులపై 25 శాతం సుంకాలు విధిస్తూ ట్రంప్ జారీచేసిన హుకుంపై కేంద్రం సంతకం చేసిందని ఆరోపించారు. ఈ కారణంగా కోట్లాదిమంది రైతులు, కార్మికులు తీవ్రంగా నష్టపోతారని ఆరోపించారు. దేశ స్వాతంత్ర్యాన్ని, ఆహార భద్రతను కాపాడుకోవాల్సిన బాధ్యత మనదందరిపై ఉందని వెల్లడించారు. అమెరికా షరతులు అంగీకరిస్తే మనం సమృద్ధిగా పండించుకునే గోదుమ, వరి, మొక్కజొన్న వంటి ఆహార ధాన్యాల కూడా దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని, పత్తి, సోయాబిన్, జన్యుమార్పిడి విత్తనాలు పన్నులు లేకుండా దిగుమతి చేసుకోవాల్సి వస్తుందని అన్నారు. ఈ విధానంతో స్థానిక రైతాంగం పంటలు అమ్ముకుకే అవకాశం కోల్పోతారని, కోట్లాదిమంది రైతులు నష్టపోతారని వివరించారు.

చెడు వ్యసనాలకు బానిస కావొద్దు

రాజాం సిటీ: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, చెడు వ్యసనాలకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవొద్దని రాజాం టౌన్ సీఐ కె.అశోక్‌కుమార్ సూచించారు. డ్రగ్స్‌తో కలిగే అనర్థాలపై బుధవారం స్థానిక ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలు, మత్తుప దార్థాలు, మద్యం, గంజాయి వంటి వాటికి దూరంగా ఉండాలన్నారు. ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటి సాధనకు నిరంతరం కృషి చేయాలని చెప్పారు.కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఇంటి వద్దకే వైద్యసేవలు

రేగిడి: ఇంటి వద్దకే వైద్యసేవలు అందిస్తున్నామని, ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని రేగిడి పీహెచ్‌సీ వైద్యాధికారి జి.అసిరినాయుడు అన్నారు. మండలంలోని ఖండ్యాం గ్రామంలో వైద్యాధికారి, వైద్య సిబ్బంది బుధవారం ఇంటింటికీ వెళ్లి ప్రజలకు వైద్యసేవలందించారు. వివిధ వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. ఏఎన్‌ఎం స్వాతి, తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానం సాంప్రదాయం కావాలి



మృతురాలి నుంచి కార్నియా సేకరిస్తున్న దృశ్యం

రాజాం సిటీ: నేత్రదానం కుటుంబ సాంప్రదాయం కావాలని రాజాం రెడ్‌క్రాస్ అధ్యక్షుడు కొత్తా సాయిప్రశాంత్‌కుమార్ అన్నారు. మరణానంతరం నేత్రాలు సజీవంగా ఉండాలంటే నేత్రదానం ఒక్కటే మార్గమని సూచించారు. మంగళవారం రాత్రి మండల పరిధి బొద్దాం గ్రామానికి చెందిన నక్క ఆదెమ్మ (70) మృతిచెందారు. ఆమె నేత్రాలను దానం చేసేందుకు కుటుంబ సభ్యులు ముందుకువచ్చి పెనుబాక గ్రామానికి చెందిన బింగి రంగనాథం, రాజాం రెడ్‌క్రాస్ సభ్యులకు సమాచారం అందించారు. వారు విజయనగరం రెడ్‌క్రాస్‌కు తెలియజేయడంతో అక్కడ నుంచి సిబ్బంది ఏ.రమణ, కె.శంకరరావు, పి.సురేష్ బొద్దాం చేరుకుని మృతురాలు ఆదెమ్మ కార్నియాను సేకరించారు. అనంతరం నేత్రదాన ఆవశ్యకతపై జాతీయ యువజన అవార్డు గ్రహీత, రెడ్‌క్రాస్ సభ్యుడు పెంకి చైతన్యకుమార్ గ్రామస్తుకు అవగాహన కల్పించారు. నేత్రదానానికి ముందుకొచ్చిన కుటుంబ సభ్యులను అభినందించారు.